సీఎం జగన్‌తోనే సంక్షేమం

- ఏలూరులో వై ఏపీ నీడ్స్ జగన్
- కార్యకర్తల్లో జోష్

ఏలూరు టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే సమాజంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమం సాధ్యమని వైఎస్సార్ సీపీ ఏలూరు క్లస్టర్–1 పార్టీ అధ్యక్షుడు సుంకర చంద్రశేఖర్, పార్టీ జిల్లా కోశాధికారి మంచెం మైబాబు అన్నారు. ఏలూరు నగరంలో ఎమ్మెల్యే ఆళ్ల నాని ఆదేశాలతో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం ఉత్సాహంగా నిర్వహించారు. ముఖ్యమంత్రిగా మరోసారి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎందుకు కావాలనే అంశాలపై స్థానికులతో మమేకమయ్యారు. ఏలూరు వన్‌టౌన్‌లోని 10వ డివిజన్ 46వ సచివాలయం పరిధిలో సోమవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. కార్పొరేటర్ పైడి భీమేశ్వరరావు ఆధ్వర్యంలో జగనన్నే మా నమ్మకం, వార్డుకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. తొలుత పార్టీ క్లస్టర్–1 అధ్యక్షుడు సుంకర చంద్రశేఖర్, క్లస్టర్–1 మహిళా అధ్యక్షురాలు పిల్లంగోళ్ల శ్రీదేవి, క్లస్టర్–1 జేసీఎస్ కన్వీనర్ మోటమర్రి సదానందం పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం డివిజన్‌లో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల బోర్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ప్రతి పేదవర్గానికి మేలు చేకూరుతుందని వివరించారు. ప్రతి డివిజన్ పరిధిలోని వేలాదిమంది పేదలకు ఈ నాలుగున్నరేళ్ల కాలంలో రూ.10 కోట్ల సంక్షేమ పథకాలను అందజేశారని తెలిపారు.


10వ డివిజన్‌లో సంక్షేమ బోర్డు ఆవిష్కరిస్తున్న చంద్రశేఖర్, శ్రీదేవి, సదానందం


సంక్షేమ బోర్డును ప్రారంభించిన మంచెం మైబాబు, స్రవంతి తదితరులు

42వ డివిజన్‌లో ..

వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. కార్పొరేటర్ అర్జి సత్యవతి ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ జిల్లా కోశాధికారి మంచెం మైబాబు, క్లస్టర్–3 మహిళా అధ్యక్షురాలు తుమరాడ స్రవంతి, కార్పొరేటర్ ఈదుపల్లి కల్యాణి పార్టీ జెండాను ఆవిష్కరించారు. రూ.44 కోట్ల సంక్షేమ పథకాల బోర్డును వారు ప్రారంభించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేదలందరికీ మేలుచేసేందుకు సంక్షేమ పాలన అందిస్తున్నారని వారు చెప్పారు. టీడీపీ హయంలో చంద్రబాబు ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. కార్యక్రమంలో టూటౌన్ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అమీనా అన్సారీ, తదితరులు ఉన్నారు.

ఓసీలకు మేలు



ముఖ్యమంత్రి జగనన్న ప్రభుత్వంలో పేదవర్గాలతోపాటు ఆర్థికంగా వెనుకబడిన ఓసీలకూ మేలు జరిగింది. నాకు ఈబీసీ నేస్తం, మా పిల్లలకు విద్యాదీవెన పథకాలు అందాయి. గతంలో ఏనాడు మాకు ప్రభుత్వం నుంచి ఎలాంటి లబ్ధి అందలేదు. నేడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మా సంక్షేమాన్ని చూస్తుంది. ఇలాంటి ప్రభుత్వం మళ్లీ రావాలని కోరుకుంటున్నాం. – ఎస్.మీనాక్షి, ఏలూరు వన్‌టౌన్

ఇంటికే పెన్షన్ వస్తోంది



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నాలుగున్నరేళ్ల కాలంలో ప్రతి నెలా 1న తెల్లవారుజామునే ఇంటి వద్దే పెన్షన్ అందుతోంది. టీడీపీ హయాంలో పెన్షన్ తీసుకోవాలంటే ఎంతో కష్టపడాల్సిన పరిస్థితి ఉండేది. పేదవర్గాలన్నీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన పట్ల ఆనందం వ్యక్తం చేస్తున్నారు. చంద్రబాబు తన హామీలు ఏనాడు నెరవేర్చలేదు. – చింతామణి ఈశ్వరి, ఏలూరు వన్‌టౌన్

క్లుప్తంగా

ఐద్వా జిల్లా కమిటీ ఎన్నిక ఏకగ్రీవం


పి.హైమావతి


ఎ.శ్యామలారాణి

ఏలూరు (టూటౌన్): ఐద్వా ఏలూరు జిల్లా నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. సోమవారం స్థానిక పవరుపేటలోని అన్నే అనసూయ భవన్‌లో ఎం.వరలక్ష్మి అధ్యక్షతన ఐద్వా జిల్లా విస్తృత సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి మాట్లాడుతూ నవంబరు 25న మహిళలపై హింసాత్మక హింస వ్యతిరేక దినోత్సవం నుంచి మానవ హక్కుల దినోత్సవం వరకు ఐద్వా ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు చేపట్టామన్నారు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ముగ్గురి మహిళల్లో ఒకరు హింసకు గురవుతున్నట్టు చెప్పారు. ప్రతి ఏటా మహిళలపై హింస పెరుగుతూనే ఉందన్నారు. మహిళలపై మన దేశంలో రోజుకు 86 హత్యలు, సగటున గంటకు 49 నేరాలు, ప్రతి 70 నిముషాలకు ఒక వరకట్న హత్య జరుగుతున్నాయని వివరించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా అధ్యక్షురాలిగా పి.హైమావతి, కార్యదర్శిగా ఎ.శ్యామలారాణి, ఉపాధ్యక్షులుగా ఎం.వరలక్ష్మి, ఎన్ పద్మాంజలి, జాయింట సెక్రెటరీలుగా పి.వెంకటరమణ, ఎన్ నిర్మల, జిల్లా కమిటీ సభ్యులుగా జె.హరీషా దుర్గ, ఎస్ మహాలక్ష్మి, పి.ఉషారాణి, జి.శారద, దివ్య, ఇందిరలను ఎన్నుకున్నారు.

సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకోవాలి


గజ్జె పూజలో పాల్గొన్న రచయిత అనంత శ్రీరామ్, గారపాటి చౌదరి తదితరులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని సినీ గేయ రచయిత అనంత శ్రీరామ్ అన్నారు. స్థానిక దొండపాడు శ్రీ బాల అయ్యప్ప క్షేత్రంలో శ్రీ బాల అయ్యప్ప కోలాట భజన బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన గజ్జె పూజలో ఆయన, తపన ఫౌండేషన్ వ్యవస్థాపకులు గారపాటి సీతారామాంజనేయ చౌదరి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. బుడిపుల సుగుణరావు గురుస్వామి నేతృత్వంలో కోలాటం నేర్చుకున్న బృందం ప్రదర్శించిన కోలాట నృత్యం భక్తులను విశేషంగా అలరించింది. తపన ఫౌండేషన్ ఆధ్వర్యంలో త్వరలో జిల్లా వ్యాప్తంగా ఉన్న కోలాట బృందాల సభ్యులు ఐదువేల మందితో ఒక భారీ కోలాట ప్రదర్శన ఏలూరులో ఏర్పాటు చేయనున్నట్టు గారపాటి చౌదరి వెల్లడించారు. కార్యక్రమంలో పుప్పాల శ్రీనివాస్, బోళ్ల వీరవెంకట సత్యనారాయణ స్వామి, తదితరులు పాల్గొన్నారు.

చెస్ పోటీల్లో పతకాలు


పతకాలు అందుకున్న చిన్నారులు

ఏలూరు రూరల్ : రాష్ట్ర స్థాయి ర్యాంకింగ్ చెస్ పోటీల్లో ఏలూరు చిన్నారులు పతకాలు సాధించారని అబ్రహాం, గ్యారీ కాస్పరొవ్ చెక్ అకాడమీ డైరెక్టర్ జి.యెహనాన్ ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల భీమవరం అల్లూరి సీతారామరాజు సమితిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ర్యాంకింగ్ చెస్ పోటీల్లో పాల్గొన్న ఏలూరు క్రీడాకారుడు జి.అభిషేక్ 5వ, కె.చోక్షిత 6వ, కె.శ్రీజ 8వ స్థానాలు సాధించారని వివరించారు. చిన్నారులు పశ్చిమగోదావరి జిల్లా అడిషనల్ ఎస్పీ సుబ్బరాజు చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారని తెలిపారు.

దివ్యాంగులకు చిత్రలేఖన పోటీలు

దెందులూరు: దివ్యాంగులకు ప్రతి ఒక్కరూ తమ పూర్తి సహాయ సహకారాలు అందించాలని దెందులూరు మండల విద్యాశాఖాధికారులు ఎవీఎస్‌వీ ప్రసాద్, కే.అన్నమ్మ అన్నారు. సోమవారం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎస్ఎల్ఎస్‌వీ శర్మ, సాల్వేషన్ ఆర్మీ హెచ్‌ఎం దాసు ఆధ్వర్యంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ వేడుకలు నిర్వహించారు. తొలుత ఐఈఆర్‌టీ ఉపాధ్యాయులు హేమలతా, శ్రీదేవి పర్యవేక్షణలో దివ్యాంగులకు పోటీల్లో చిత్రలేఖనం, ఆటల పోటీలు, పాటల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

వైభవంగా కార్తీక సోమవారం పూజలు


పూజలందుకున్న దక్షిణపువీధి మార్కండేయ ఓంకార విశ్వేశ్వరస్వామి


స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు


దొండపాడు నం దత్తనాథ క్షేత్రంలో స్వామివారికి అభిషేకం చేస్తున్న భక్తులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): కార్తీక మాసం మూడో సోమవారం పర్వదినం సందర్భంగా నగరంలో శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజామున నుంచి భక్తులు ఆయా శివాలయాలు చేరుకుని ధ్వజస్తంబాల వద్ద కార్తీక దీపాలు వెలిగించి, భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు. పలు శైవక్షేత్రాల్లో విశేష పూజలు చేశారు. పత్తేబాద శ్రీ చౌడేశ్వరి రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో పూర్వాషాడ నక్షత్రంతో నిత్యపూజలు నిర్వహించారు. మహన్యాస పూర్వక అభిషేకాలు నిర్వహించి తీర్థ ప్రసాద వినియోగం చేశారు. సాయంత్రం ఆకాశదీప పూజ చేసి స్వామి వారికి విశేష అలంకరణ చేశారు. అర్చకుడు కొడమంచిలి లక్ష్మణరావు విశేష పూజలు చేయగా, కార్యనిర్వహణాధికారి డి.శంకరరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు. దొండపాడు శ్రీ నం దత్తనాథ క్షేత్రంలో సర్వదోష పరిహారక విశ్వేశ్వర స్వామికి ఉదయం మహన్యాస పారాయణ, లఘున్యాస పూర్వక ఏకవార రుద్రాభిషేకాలు చేసి అనంతరం విశేష అలంకరణ, అర్చన చేశారు. సాయంత్రం ప్రదోషకాల అర్చన, రుద్ర త్రిశతి నామార్చన, బిల్వార్చన, శివ సహస్రనామ పారాయణ చేసి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. క్షేత్రం అర్చకుడు ఘంటసాల రామకృష్ణ విశేష పూజలు చేయగా, వ్యవస్థాపక ట్రస్టీ వేణుగోపాల్ లునాని, కార్యదర్శి కాకి బాబు కార్యక్రమాలను పర్యవేక్షించారు. శనివారపుపేట శివాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. పవర్‌పేట శ్రీ కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి దేవస్థానంలో తెల్లవారు జాము నుంచి భక్తుల గోత్రనామాలతో స్వామి వారికి రుద్రాభిషేకం నిర్వహించారు. అన్నపూర్ణ అమ్మవారికి కుంకుమ పూజ చేశారు. సాయంత్రం స్వామి వారికి విశేష అలంకరణ చేసి, ఆకాశదీప పూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించి విశేష హారతి సేవ చేశారు. అర్చకుడు కందుకూరి రామబ్రహ్మానంద శర్మ ప్రత్యేక పూజలు చేయగా, కార్యనిర్వహణాధికారి ఎం రామాంజనేయులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

చదువుతోనే ఉన్నత శిఖరాలు



సదస్సులో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి రత్నప్రసాద్

ఏలూరు (టూటౌన్): విభిన్న ప్రతిభావంతులు అందరితో సమానంగా విద్యను అభ్యసించాలని, చదువుతోనే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ అన్నారు. స్థానిక దొండపాడు పరివర్తన విభిన్న ప్రతిభావంతుల పాఠశాలలో సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. విభిన్న ప్రతిభావంతులకు అన్ని రంగాల్లోనూ రిజర్వేషన్ సదుపాయం ఉందన్నారు. ప్రభుత్వ పథకాల్లో కూడా ప్రత్యేక సదుపాయం కల్పించారని, ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. పథకాలు పొందటంలో అవసరమైతే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ న్యాయ సహాయం అందిస్తుందని చెప్పారు. పాఠశాల ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు తమ పాఠశాలలో అన్ని రకాల సదుపాయాలను ఏర్పాటు చేశారన్నారు. విభిన్న ప్రతిభావంతుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి ప్రత్యేకమైన విభాగం ఉందని చెప్పారు. యోగ, ధ్యానం మొదలైన మానసిక, శారీరక నైపుణ్యాన్ని కలిగించే విద్యను నేర్పుతున్నట్టు తెలిపారు. సదస్సులో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

9, 10 తేదీల్లో ఏఐటీయూసీ జిల్లా మహాసభ

ఏలూరు (టూటౌన్): ఈ నెల 9,10 తేదీల్లో ఏలూరులో ఏఐటీయూసీ ఏలూరు జిల్లా ప్రథమ మహాసభ నిర్వహిస్తున్నట్టు జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వరరావు, ది.జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎ.అప్పలరాజు తెలిపారు. ఏలూరు ఆర్ఆర్‌పేట సర్వీస్ రిజర్వాయర్–2 వద్ద మస్టర్ టైంలో ప్రచార కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఏఐటీయూసీ మహాసభను విజయవంతం చేయాలని కోరారు. మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు బి.నారాయణరావు, డి.వెంకటేశ్వరరావు, అప్పారావు, కె.శ్రీను, దుర్గారావు, సింహాచలం పాల్గొన్నారు.

గాయకులు, కళాకారులకు ఘంటసాల స్ఫూర్తి


ఘంటసాల విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కళాకారులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): తెలుగు ప్రజలతోపాటు ప్రపంచంలోని సంగీత కళాకారులకు, గాయనీ గాయకులకు ఘంటసాల స్ఫూర్తిగా నిలిచారని ఘంటసాల సంగీత కళాశాల వ్యవస్థాపక అధ్యక్షుడు టి.శరత్‌చంద్ర అన్నారు. స్థానిక రామకృష్ణాపురంలోని సాహిత్య మండలి ప్రాంగణంలో ఘంటసాల 101వ జయంతిని సోమవారం నిర్వహించారు. శరత్‌చంద్ర మాట్లాడుతూ ఘంటసాల సంగీతానికి ప్రపంచ వ్యాప్తంగా గొప్ప ఆదరణ ఉందన్నారు. ఆయన గాత్రం తెలుగు ప్రజలకు లభించిన గొప్ప వరమన్నారు. జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు లంకా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ శాస్త్రీయ సంగీతాన్ని ప్రజాస్వామీకరించి దానిని జనరంజకం చేసిన స్వరకర్త, వాగ్గేయకారుడు ఘంటసాల అన్నారు. ఘంటసాల ఆయన పాడిన అజరామరమైన గీతాల రూపంలో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. తొలుత ఘంటసాల సంగీత కళాశాల అంతర్జాతీయ అధ్యక్షుడు మధు అన్నా తదితరులు ప్రాంగణంలోని ఘంటసాల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏలూరు ఘంటసాల సంగీత కళాశాల ప్రిన్సిపాల్ వి.రేవతీ రాంకుమార్, కరస్పాండెంట్ వి.రామ్ కుమార్, ఘంటసాల స్వరపీఠం అధ్యక్షుడు ఎస్ఎం సుభాని, గాయకుడు వై.అర్జున్, సాహిత్య మండలి కార్యదర్శి పుల్లాభొట్ల పురుషోత్తం పాల్గొన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	35
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.15	35
ఏలూరు – బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	42
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	25

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్	21.45	4820	24
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	18
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	21
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4822	13
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	21.00	4804	13
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	19
ఏలూరు – విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు –తిరుపతి	16.00	4830	30

నిబంధనల ప్రకారమే ఓటర్ల నమోదు

ఏలూరు రూరల్ : నిబంధనల ప్రకారమే ఓటర్ల నమోదు ప్రక్రియ జరిగిందని ఏలూరు నియోజకవర్గం సహాయ ఓటరు నమోదు అధికారి బి.సోమశేఖర్ తెలిపారు. రెండు రోజుల స్పెషల్ క్యాంప్‌లో 1,488 దరఖాస్తులు అందాయన్నారు. ఇందులో ఫారం–6లో 614, ఫారం–7లో 128, ఫారం–8లో 746 ఉన్నట్టు తెలిపారు. ఓటరు నమోదు ప్రక్రియలో ఫొటోలకు బదులు ఆధార్ కార్డులు, లెక్కకు మిక్కిలి తప్పులు పేరుతో ఓ పత్రికలో వచ్చిన వార్తల్లో వాస్తవం లేదన్నారు. స్థానిక జలాపరమేశ్వర స్కూల్ పోలింగ్ కేంద్రం 185, 186 పరిధిలో మరణించిన వారి పేర్లు తొలగించడం, సరిగ్గా లేని ఫొటోల స్థానాలో ఫొటోలను బీఎల్ఓలు నమోదు చేస్తున్నారని వివరించారు. 140 పోలింగ్ కేంద్రం పరిసరాల్లో ఒకే ఇంటి నెంబర్‌పై 20 మంది ఓటర్లు ఉన్నట్టుగా ఓ పత్రికలో పేర్కొనడంపై విచారించగా, రెండు కుటుంబాలకు చెందిన 10 మంది మాత్రమే ఒకే ఇంటిలో అద్దెకు నివసిస్తున్నారని వెల్లడైందన్నారు. కొన్నిచోట్ల గుర్తింపు కార్డులో చిన్నవిగా ఉన్న ఫొటోల స్థానంలో కొత్త ఫొటోలు ఓటర్లు ద్వారానే బీఎల్‌లోలు పూరించారని చెప్పారు. మృతులు, స్థానికంగా నివాసం లేనివారు, రెండు ఓట్లు గల వ్యక్తులను గుర్తించి వారి సంబంధీకుల ద్వారానే ఫారం పూర్తి చేసి బీఎల్ఓలు చర్యలు చేపట్టారని వివరించారు.

యూటీఎఫ్ జిల్లా కార్యదర్శిగా నంబూరి


నంబూరి రాంబాబు

ఏలూరు రూరల్: యూటీఎఫ్ ఏలూరు జిల్లా కార్యదర్శిగా నంబూరి రాంబాబు మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం ఏలూరు జిల్లా యూటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన సంఘం సమావేశం వివరాలను ఆయన వెల్లడించారు. ఏలూరు మండల శాఖ ఇన్‌చార్జిగా ఉన్న రాంబాబు ఎన్నిక పట్ల మండలశాఖ అధ్యక్షుడు సురేష్, ప్రధాన కార్యదర్శి పూరాఖాన్, నాయకులు టి.ఆసయ్య, జి.మాదవిలత, ఒ.ధనం జయరావు, పి.ప్రసన్న, పి.శ్రీనివాస్‌కుమార్, పి.జనార్ధనరావు, బి.ప్రభాకర్‌రావు, ఎండీ వహిదాభేగం, బి.విజయనంద్ హర్షం వ్యక్తం చేశారు.

ఆర్టీసీ ప్రయాణికులకు బహుమతులు


విజేతలకు బహుమతులు అందిస్తున్న మేనేజర్ వాణి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆర్టీసీ లక్కీ డిప్ విజేతలకు బహుమతులు అందజేశారు. ఏలూరు ఆర్టీసీ డిపో పరిధిలో చింతలపూడి, భీమవరం, ద్వారకాతిరుమల రూట్లలో గత నెల 15 నుంచి 30వ తేదీ మధ్య ప్రయాణించిన వారి టిక్కెట్లతో లక్కీడిప్ సోమవారం స్థానిక ఆర్టీసీ కొత్త బస్టాండులో నిర్వహించారు. చింతలపూడి రూట్‌లో బ్రహ్మానాయుడు, రాములు, కుమారస్వామి, ద్వారకాతిరుమల – భీమడోలు రూట్‌లో శాంతి, శేషజ్యోతి, రాజు, ద్వారకాతిరుమల – దెందులూరు రూట్‌లో సలోమి, మాత్రేశ్వరి, ప్రశాంతి, భీమవరం రూట్‌లో సాయి విజయ, సోమరాజు, పాండు విజేతలుగా నిలిచారు. వీరికి ఏలూరు ఆర్ఎస్ బ్రదర్స్ షాపింగ్ మాల్ సంస్థ సౌజన్యంతో బహుమతులు అందించామని డిపో మేనేజర్ బి.వాణి తెలిపారు. ఆర్టీసీలో బస్సుల్లో సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవచ్చని, ఎప్పటికప్పుడు సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే ఇటువంటి లక్కీడిప్‌లలో బహుమతులు గెలుచుకోవచ్చని అన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఏలూరు డిపో అసిస్టెంట్ మేనేజర్, ఆర్ఎస్ బ్రదర్స్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	30	అరటి కాయ (1)	07–10
వంకాయలు (గులాబీ)	50	చిక్కుడు కాయలు	68
వంకాయలు (కాంతులు)	50	చామదుంపలు	44
వంకాయలు (తెలుపు)	--	ములక్కాడలు	07–10
బెండకాయలు	44	కంద	60
పచ్చిమిర్చి	30	బీట్‌రూట్	40
కాకర కాయలు	32–38	కీరా దోస	44
బీరకాయలు	30	ఫ్రెంచ్‌బీన్స్	70
బీరకాయలు (పందిరి)	44	అల్లం	120
క్యాబేజీ	24	కొత్తిమీర (కట్ట)	15
క్యారెట్	40–50	పాలకూర	12
దొండకాయలు	34	చుక్కకూర	12
బంగాళదుంపలు	26	తోటకూర	12
ఉల్లిపాయలు	45–50	గోంగూర	06
గోరుచిక్కుడు	44	పుదీనా	05
దోసకాయలు	28	బఠాణి	--
ఆనబకాయ (1)	20–25	క్యాప్సికమ్	64
పొట్లకాయ(1)	15–20	చిలకడదుంప	30

శివయ్యకు అభిషేకాలు

ద్వారకాతిరుమల: క్షేత్రపాలకునిగా విరాజిల్లుతోన్న శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామివారి ఆలయంలో మూడో కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని శివదేవునికి విశేష అభిషేకాలు నిర్వహించారు. తొలుత దేవస్థానం సిబ్బంది ఆలయాన్ని సుగంధ భరిత పుష్పమాలికలతో శోభాయమానంగా అలంకరించారు. తెల్లవారు జాము నుంచే ఆలయానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారికి అభిషేకాలు, పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలోని ఉసిరిచెట్ల వద్ద మహిళలు దీపాలను వెలిగించారు. ఆలయ గర్భాలయంలో కొలువైన శివదేవుని లింగస్వరూపానికి ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చరణల నడుమ క్షీరాభిషేకాలు నిర్వహించారు. రాత్రి శివయ్యకు జరగాల్సిన గ్రామోత్సవం తుపాను కారణంగా రద్దయ్యింది.

రంగాపురంలో సత్యదేవుని వ్రతాలు

లింగపాలెం: లింగపాలెం మండలం రంగాపురంలోని సత్యనారాయణస్వామి ఆలయం సోమవారం భక్తులతో కిటకిటలాడింది. పశ్చిమగోదావరి, కృష్ణా, ఖమ్మం జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి సత్యనారాయణస్వామి వ్రత పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

త్రీటౌన్ స్టేషన్‌లో రైటర్ విధుల్లో ట్రైనీ డీఎస్పీ


త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో రైటర్ విధుల్లో శిక్షణ పొందుతున్న ట్రైనీ డీఎస్పీ విద్య

ఏలూరు టౌన్: ఏలూరు త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ట్రైనీ డీఎస్పీ డి.విద్య రైటర్ విధులు నిర్వర్తించారు. ఎస్పీ మేరీ ప్రశాంతి ఉత్తర్వుల మేరకు ఆమె ఏలూరు జిల్లాలో శిక్షణ పొందుతున్నారు. అనంతపురంలో డీఎస్పీగా ప్రాథమిక శిక్షణ పూర్తిచేసుకున్న ఆమె ఏలూరు జిల్లాకు వచ్చారు. ఏలూరు డీఎస్పీ ఈ.శ్రీనివాసులు పర్యవేక్షణలో ఏలూరు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్ విధులు, టూటౌన్ స్టేషన్ పరిధిలో హెడ్ కానిస్టేబుల్ విధులు నిర్వర్తించారు. తాజాగా త్రీటౌన్‌స్టేషన్‌లో రైటర్ విధుల్లో శిక్షణ పొందుతున్నారు. త్రీటౌన్ సీఐ కోమాకుల శివాజీ శిక్షణలో సహకారం అందించారు. స్టేషన్‌లో రికార్డులు, సిబ్బందికి విధులు, స్టేషన్ వాచ్, కోర్టు, డే నైట్ బీట్స్, ఇతర ప్రదేశాలకు తపాలా విధులు, ఎన్‌బీడబ్ల్యూస్, సమన్స్, విధులు బట్వాడా, సిబ్బంది మధ్య సమన్వయం వంటి అంశాల్లో తర్ఫీదు పొందారు. అనంతరం రెండు నెలలు జంగారెడ్డిగూడెం పోలీస్ స్టేషన్‌కు ఎస్‌హెచ్‌ఓగా విధులు నిర్వర్తిస్తారు.